


శ్రీదేవీ మురళీధర్

# ఆపరేషన్ 'అమ్మలు'

దేవీ నవరాత్రులు ఆరంభమై ఎనిమిది రోజులై నాయి. పై తరగతి వాళ్లూ, మధ్యతరగతి వాళ్లూ కలగలిసి కాపురాలున్న కాలనీ అది. నాలుగు గదుల ఆ ఇంట్లో పెద్ద గది పూజకు కేటాయించబడినది.

ఆ ఇంటి బయట, లోపల ఎప్పుడూ హడావుడీ, పర్వ దినాలలో మరింత సందడి. దసరాలు కాబట్టి చెప్పనక్కర లేదు. పూజగది గడప దగ్గర అఖండదీపం ఉజ్వలంగా వెలుగుతోంది. వచ్చిన ప్రతివాళ్లూ నియమంగా తలా కాస్త నువ్వులనూనె, వత్తి, కర్పూరం బిళ్ల... ఇవన్నీ అక్కడ జరిగే తంతుకు తమ వంతు నమ్మకానికి ప్రతీకగా సమర్పించు కుంటున్నారు. ఈశాన్యంలో పూజా మంటపంలో దేవీదే వతా విగ్రహాలు అమర్చి, అర్చించబడి ఉన్నాయి. గది గోడల నిండా దుర్గాదేవి చిత్రపటాలు నిండైన మాలలతో అలరారుతున్నాయి.

ఉత్తర దిక్కుగా పెద్ద కుర్చీ పీట పట్టుచీరతో కప్పబడి ఉన్నది. దానిపై కొలువై ఉన్నది ఒక ఎనిమిదేళ్ల పాప. అందరూ ఆ పాపను దుర్గాదేవి రూపంగా ఆరాధిస్తు న్నారు. ఆకలి, దాహం, నిద్ర, ఆమె జోలికి రావు. నిశ్చ లంగా కూర్చుని భక్తుల వంక అనుగ్రహదృష్టిని ప్రసరిస్తూ ఉంటుంది. ఏదీ మాట్లాడదు. మనసారా నమ్మిన వారి కోరి కలు తీరుస్తుందని అంటారు. పక్కన ఇత్తడి పళ్లేలలో పసుపు, కుంకుమ రాశిగా పోసి ఉన్నాయి. గది నిండా అగరు ధూపం కమ్ముకుని పవిత్రమైన అనుభూతిని కలిగి స్తోంది.

పల్చని, తెల్లని ముఖం, అందానికి మించిన వర్చస్సు, తీరైన ముఖకవళికలు, పొడవైన వత్తయిన ఉంగరాల జుట్టు... ఎర్రని పట్టు పరికిణీ కట్టబెట్టారు. కాళ్ల నిండా పసుపు, పారాణి, వెండి పట్టాలు, చేతులకు ఎర్రని గాజులు, మెడలో చంద్రహారం, అడ్డిగ, చెవులకు ఎర్రరాళ్ల జూకాలు, ముఖాన పసుపు పులిమిన ఛాయలు, విశాల మైన నుదుట తీర్చిన త్రిపుండ్రాలు, మధ్యన బాలభానుడి లాంటి గుండ్రని నల్లని కళ్ల నిండా కాటుక, కొలుకుల చివర్న రేఖలా తీర్చి ఉంది. అందరూ ఆ పాపవైపు రెప్ప వాల్చకుండా చూస్తున్నారు.

"బెజవాడ దుర్గమ్మే దిగివచ్చి కూచుంది"

"దైవ లీలలు విన్నగలమా? ఏ రూపంలో ఎక్కడ కని పిస్తాడో!"

"అబ్బ! కళ్లతో చూస్తే చాలు... కష్టం సగం తీరినట్లే"

నిశ్చలంగా, ఏకాగ్రదృష్టితో, నిటారుగా, కొన్ని గంటల నుంచి కూర్చుని ఉన్న ఆ పాప రూపాన్ని చూచి అంతా అబ్బురపడుతున్నారు. ముఖంలో ఏమాత్రం విసుగు, అలసట కనిపించటం లేదు. ఆ వయసు పిల్లలు గల వారంతా విస్తుపోతున్నారు.

"మా పిల్లది ట్యూషన్ మాస్టారొస్తే చాలు అరగంట కూచోటానికి ఆపసోపాలు పడుతుంది"

"సరేలే సంగీతం పంతులమ్మ కూచోబెడితే మా పిల్ల కాన గుండు సూదుల మీద కూచున్నట్లే ఎగిరెగిరి పడు తుంది"

"మా కోతిగాడు టీవీ ముందైతే గంటల తరబడి ఉలుకూ పలుకూ లేకుండా కూచుంటాడు. చదువుకో మ్మంటే మాత్రం నిప్పుల మీద కూచున్నట్లే"

గుళ్లో అభిషేకానికి, అర్చనకూ రేటున్నట్లే మనుషుల కోరికలను బట్టి వివిధ రేట్లున్నాయి.

ఆ పసిపాప పినతండ్రీ పినతల్లీ అక్కడి 'వ్యవహారక ర్తలు', అందరూ వారిని ఆశ్రయిస్తున్నారు.

"మా ఆవిడకు ముప్పై ఏడేళ్లు. మాకు సంతానం కల గలేదు. చెయ్యని నోము లేదు. మొక్కని మొక్కు లేదు" ఒక నలభై ఏళ్లాయన కళ్లొత్తుకున్నాడు.

పినతండ్రి సదాశివం అతడి వంక నిశితంగా చూశాడు. అతడి పది చేతివేళ్లలో ఆరింటికి ఉంగరాలు న్నాయి. అందులో రెండు రవ్వలవి. మెళ్లో ఇత్రిపోతు లాంటి పెద్దగొలుసు. అతడి భార్య కూడా బంగారంలో మునిగి తేలుతోంది.

సదాశివం తన భార్య వంక అర్థయుక్తంగా చూశాడు. "పిల్లలు కలగలేదట భవానీ" అంటూ, "ఊ, నమ్మి వచ్చి మీ అంతట మీరే అడుగుతున్నారని చెబు తున్నాం. ముందు కాళ్లు కడుక్కు వచ్చి కిలో పసుపు, కుంకం, అయిదు కొబ్బరికాయలు 'అమ్మలు'కి సమ ర్పించి కోరిక చెప్పుకోండి. నమ్మకం ముఖ్యం" అన్నదామె ఆడమనిషితో.

సదాశివం మగమనిషిని దగ్గరకు పిలిచాడు. "దణ్ణం పెట్టుకుని కోరిక చెప్పుకున్నప్పుడు ఒక రెండు వేల రూపా యలు అమ్మలు దగ్గర హుండీలో వెయ్యండి. మీ ప్రార బ్ధంలో దోషం వదిలించుకున్నట్లన్నమాట"

"తప్పకుండా, తప్పకుండా" అంటూ భక్తిగా లోపలికి నడిచారు వాళ్లు. భవానీ వాళ్ల వెనకాతలే వెళ్లింది. భార్యా, భర్తా మనసులో కోరిక చెప్పుకుని డబ్బు సమర్పించి వెను దిరిగారు.

"కోరిక తీరుతుంది. అనుమానం వద్దు. తీరిన క్షణమే వచ్చి నిలువుదోపిడీ ఇవ్వాలి. మర్చిపోవద్దు" అన్నది వాళ్లతో భవానీ.

జంట క్షణకాలం ముఖాముఖాలు చూసుకున్నారు. "అవునండీ, పుట్టిన బిడ్డ బతికి బట్టకట్టాలా? తల్లి ఈ వయసులో పురుడు వెళ్లబుచ్చి క్షేమంగా ఉండాలా వద్దా?"

మీ క్షేమం కంటే డబ్బు ముఖ్యమా అన్నట్లు అడిగింది భవాని. ఆ జంట తమకు అనుమానం కలిగిన పాపానికి లెంపలు వేసుకుని సరేనని తలపంకించారు.

"మా పిల్లకు ముప్పై ఏళ్లు దాటినై. పెళ్లి కుదరటం లేదు" ఒక తండ్రి గోడు, పక్కని తలదించుకుని కూతురు.

"ఏం చేస్తాం, ఖర్మ, పసుపూ కుంకం సమర్పించి అమ్మలు దగ్గర మొరపెట్టుకో. వెయ్యి నూటపదహార్లు సమ ర్పించి కాలు మీద కాలేసుకుని కూచో. పెళ్లి దానంతట అదే కుదురుతుంది" చెప్పాడు సదాశివం.

ఈ ముసలాయన చెప్పిన ప్రకారం చేశాడు. "ఇదుగో పెద్దాయనా! పెళ్లి కుదరంగానే 'అమ్మల్ని' మరిచేవు! పది వేలు తెచ్చి సమర్పించాలని, గుర్తుంచుకో. నమ్మకమయ్యా నమ్మకం. నమ్మి చెడినవాడు లేడు"

అన్ని రకాల ఈతిబాధలు కృంగదీసే మనుషులు అక్కడ ఉన్నారు. అది మనుషుల రద్దీ కాదు, పరిష్కారాల కోసం వెంపర్లాడే సమస్యల రద్దీ.

కాన్సర్ పాలబడిన పసిబిడ్డను ఎత్తుకుని ఒక యువ జంట, రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించిన కుర్ర మనవణ్ణి వెంట బెట్టుకుని ఒక తాతయ్య, చేతబడి చేశా రన్న అనుమానంతో భార్యని తోడ్కొని ఒక భర్త, ఎంత చదివినా మార్కులు రాని కొడుకుని తీసుకుని ఒక విధవ రాలు, దయ్యం పట్టి పీడిస్తున్నదని భావించబడే అత్తగారిని బలవంతంగా లాక్కొచ్చిన కోడళ్లు... ఇలా రకరకాల మనుషులతో ఆ లోగిలీ, నడవా, బయట వీధిలో సగభా గమూ నిండి ఉన్నాయి.

"ఎన్నో ప్రయత్నాలు చేసి చూశాం. ఇదీ చూద్దాం, ఏ పుట్టలో ఏ పాముందో!" అన్న ఆశ వారిని అక్కడికి లాక్కొంచింది.

ఆ సంగతి అక్కడి 'వ్యవహార దక్షుల'కు క్షుణ్ణంగా తెలుసు. వారిది అవసరం, వీరిది అవకాశం.

రాత్రి పది కావస్తుంది. పొద్దున ఏడింటికి మొదలైన రద్దీ ఏమాత్రం తగ్గుతున్నట్లు లేదు.

"కానివ్వండి, బయల్దేరండి. ఇంక రేపే దర్శనం. పవ



ళింపు సేవ వేళైంది. కానివ్వండి, మూసేస్తున్నాం" సదాశివం, భవాని హడావుడిగా అందరినీ సాగనంపారు. చివరకు నిట్టూర్చి, గేటుకి తాళం, ఇంటి తలుపులూ బిగించారు.

"అంతా వెళ్లినట్టేగా, లోపల సరిగ్గా చూశావా?" భార్యను అడిగాడు సదాశివం. "ఆహా, ఇల్లు ఖాళీ. పాడు రద్దీ. కోరికలకు మాత్రం అంతుండదు కానీ పైసా విదల్చా లంటే ప్రతీ గాడిదకొడుక్కీ సమస్యే!" అన్నదామె అక్కసుగా.

"ఔనౌను. ఆ మూర్ఛల పిల్లాడి తల్లిని చూశావా? వొర్తి అనుమాన వ్యక్తి, నన్ను, నిన్నూ, అమ్మల్నీ మార్చి మార్చి చూసింది. ఎంత చెప్పినా ఎర్ర ఏగానీ హుండీలో వెయ్యలేదు. పైగా ఎవరో ఇచ్చిన కొబ్బరికాయ ప్రసాదం, ప్రసాదం అంటూ పట్టుకుపోయింది. ఇంకోసారి దాన్ని రానివ్వకు" కసిగా అన్నాడతను.

కుర్చీ పీటకు, గోడకు మధ్య ఆ జారగిలబడి సొమ్మసిల్లి "లేవనా పిన్నీ?" అన్నది అమ్మలు దీనంగా.

"ఆ, లే. ఎప్పుడెప్పుడు లేద్దామా అనే చూస్తుంటావు" పినతల్లి అనడమే తరువాయి బాత్రూంకేసి పరుగెత్తింది అమ్మలు.

పాప బయటకి వచ్చాక ఒంటి మీది నగలన్నీ గబగబా వలిచేసింది భవాని. అలమారు తెరిచి జాగ్రత్త చేస్తూ "అన్నీ తీసిచ్చావా" అని ఒకటికి నాలుగు సార్లు లెక్కచూసుకుంది.

ఈ లోపల సదాశివం పసుపు బట్ట వాసెన కట్టి హుండీ తెరిచాడు. లెక్కపెట్టి నిరాశగా "నిన్నటికంటే నాలుగు వేలు తక్కువ. దసరా రోజులు అయిపోవస్తున్నాయి. కాస్త ముడుపులు ఘనంగా చెల్లిస్తారనుకున్నా" అన్నాడు.


"చూడబోతే కిటకిట... దబ్బు మాత్రం కటకట" అలమారు తాళం వేసి గది సర్దుతూ కోపంగా అన్నది భవాని.

"పిన్నీ... ఆకలి" మెల్లగా, భయంగా అన్నది అమ్మలు.

చటుక్కుని మొట్టికాయ తగిలించింది భవానీ. "ఆకలి, ఆకలి అని చస్తావేమే ఓర్చుకోవడం నేర్చుకో మొద్దుమొహమా, నీకు ఆకలీ, దాహం, నిద్రా ఉండవని జనాల్ని నమ్మించటానికి మేమిద్దరం రాత్రీ పగలూ ఛస్తున్నాం. ఇప్పుడిప్పుడే అంతా నమ్ముతున్నారు" గొణుగుతూ, పోగయిన కొబ్బరికాయల్ని బియ్యపు గోతం నిండా వేసి తాడు బిగించింది. మర్నాడు తెల్లారగట్టే గుడి దగ్గర అమ్మే ఆసామీ వచ్చి తక్కువ ధరకు కొబ్బరికాయలు, పసుపు, కుంకం, పట్టుకుపోయే ఏర్పాటు చేసుకున్నారు.

"అదుగో అలా ప్రచారం చెయ్యబట్టే జనం విరగబడి వస్తున్నారు" అంటూ పూజగది తలుపు మూసి వంటింటి కేసి నడిచాడు సదాశివం.

భోజనానికి కూర్చోగానే అమ్మలు ఆవురావురుమని తినసాగింది.



"ఇదుగో అమ్మలూ! రేపు తొందరగా లే. దసరాలు అయిపోవచ్చాయి. తెల్లారగట్ట తాగే పాలే. మళ్లీ రాత్రికి అందరూ వెళ్లాకే అన్నం, గుర్తుంచుకో, కూచొని సోలబడ గూడదు. ఎవరు ఏదడిగినా జవాబు చెప్పకు. సూటిగా నవ్వుమొహంతో వారి వంక చూడు. ఏదీ మాటాడకు. అంతగా అవసరమైతే నేనో, బాబాయో చెబుతాంలే" రోజూలాగా జాగ్రత్తలు నూరిపోస్తున్నారు భార్యాభర్తలు.

"పిన్నీ నిద్దరొస్తుంది" అస్తమానం కూచుని ఉండటం వల్ల కాళ్లు పట్టేసి నడుము, వీపు నొప్పితో నెలల తరబడి బాధపడుతోంది ఎనిమిదేళ్ల అమ్మలు.

పడుకుంటే ఒక విధంగా పక్క కుదరటం లేదు. సరైన వేళకు ఆహారం, నీరు లేక మలబద్ధకం, బాత్రూంకి వెళ్లేది కుదరక కడుపులో పోట్లు... నగల బరువుకి మెడనొప్పి, నిద్ర చాలక కళ్లుమంటలు, తలనొప్పి... ఇదీ అమ్మలు ఆంతరంగిక నరకం!

"ఇహ ఇలా కాదులే. పెద్ద సిటీలకు వెళ్లాలి. ఇవాళొచ్చారే. ఎవరో జమిందారీ కుటుంబమట. కాకినాడ రమ్మంటున్నారు దివాణంలో బస ఏర్పాటు చేస్తారట"

భవాని భర్తతో చెప్పింది.

★ ★ ★

మరునాడే విజయదశమి!

నవమి రోజు కూడా అమ్మలు దర్శనానికి తండోపతండాలుగా జనాలొచ్చారు. హుండీ నిండి, ఖాళీ చేసే వ్యవధి లేక కొత్త హుండీ కూడా పెట్టాల్సి వచ్చింది.

ఆ రాత్రి ఎనిమిదింటికి టీవీలో ఆస్ట్రేలియా-ఇండియా క్రికెట్ మాచ్ జరుగుతోంది. ప్రకటనలు వచ్చే టైములో ఛానెల్ మార్చి తెలుగు వార్తలు పెట్టారు.

ఇంతలో ఎక్కడ నుండి వచ్చాడో 'ఘోరమైన నేరాలు' ప్రోగ్రాం యాంకర్ తెరపైకి వచ్చాడు. ముఖమంతా గడ్డాలూ, మీసాలే... కుర్రకారంతా 'బూచాడు' అని ముద్దుగా పిలుస్తారు.

"రాత్రి ప-ది-గం-ట-ల-కు తప్పక చూడండి.

అమ్మలుకి కూడా ఆకలౌతోంది!

అమ్మలు కూడా అలసిపోతోంది!

అమ్మలు కూడా అందరిలాంటి అమ్మాయే! అమ్మోరు కాదు!

రాత్రి ప-ది-గం-ట-ల-కు మీకు ఇష్టమైన 'బీ' ఛానెల్‌లో" మరీ మరీ హెచ్చరించాడు.

ముడుపులు సమర్పించుకున్న భక్తజనావళి ఉలిక్కిపడింది.

అందరిళ్లల్లో ఫోన్లు మోగుతున్నాయి. ఎవరూ ఎత్తటానికి ఇష్టపడటం లేదు. పది గంటలకు ప్రసారం మొదలైంది. 'ఆపరేషన్ అమ్మలు' అనే శీర్షికతో.

ముందుగా అమ్మలు నివశిస్తున్న ఇంటి పరిసరాలు చూపించారు. ఇంటి బయటా, లోపలా ఉన్న రద్దీని చూపించారు. అందరికీ ముడుపులు చెల్లించే విధానాలు వల్లిస్తున్న సదాశివం, భవానీలను చూపించారు. రెండు జంటలు టీవీ ఛానెల్ వారు పంపినవేనని రూఢీ అయింది ఆ రద్దీలో.

'దైవాంశ కల బిడ్డ. మా పూర్వజన్మపుణ్యాల ఫలం, మా ఇంట వెలసింది. తల్లీ దండ్రీ పసితనంలో పోతే, పిల్లలు లేని మా ఒడి చేరి మమ్మల్ని ధన్యుల్ని చేసిందమ్మో' భక్తి పారవశ్యంతో చెబుతూ భవానీ అమ్మలక్కల్ని ఆకట్టుకుంటోంది.

"గుక్కెడు పాలు అడగదు, పట్టెడు మెతుకులు కతకదు. ప్రపంచం కోసం నిద్ర నటిస్తుంది. అమ్మో దుర్గాభవానీ... ఈ తుచ్ఛుణ్ని నీ రక్షకుడిగా ఎందుకు ఎన్నుకున్నావమ్మో?" ఉద్వేగభరితంగా చెబుతూ కండువాతో కళ్లొత్తుకున్నాడు సదాశివం. కాలం నాడు చిన్నాచితకా సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టు, రంగస్థలాన్ని కూడా యథాశక్తి దున్నాడు.

చుట్టూ వింటున్న జనం 'వన్స్‌మోర్' అనలేదు కానీ, 'నిజమా?' అన్నట్లు చూశారు.

వాసెన కట్టిన హుండీలో అంతా డబ్బులు వెయ్యటం, దణ్నాలు పెట్టడం, పసుపు కుంకాలు రాశిపొయ్యటం, కొబ్బరికాయలు సమర్పించటం చూపించారు.

అది చూసినంత సేపూ "చూడండి, బాగా చూడండి. మీ కళ్లు పూర్తిగా తెరుచుకుంటాయి" అంటూనే ఉన్నాడు గడ్డపాయన.

ముద్దులొలికే అమ్మల్ని ఆపాదమస్తకం వివరంగా చూపించారు.

"అభం శుభం ఎరుగని అమాయకపు ఆడపిల్ల అనుకుంటున్నారా? ఆకలి దప్పులను, నిద్రను జయించిన యోగిని అనుకుంటున్నారా? అలా అనుకుంటే అది మీ భ్రమ మాత్రమే!"

జనం ఎంత పిచ్చివాళ్లో బయటపెట్టే అదృష్టం తనకు కలిగినందుకు మురిసిపోతున్నట్లుంది యాంకర్ ముఖం.

"ఎక్కడో చిత్తూరు దగ్గర పుట్టి, తల్లిదండ్రుల్ని పోగొట్టుకుని పినతండ్రి ప్రాపకంలో పెరుగుతున్న ఈ పాప మీరు అనుకునే మహాశక్తి కాదు, ప్రజల్లో మూఢనమ్మకాలను పెంచి పోషించే మహమ్మారి!

ఎకరం పొలం కూడా లేక స్టేజి మీద, సినిమాల్లో వేషాలు వెలగబెట్టిన పినతండ్రీ, కుట్టుమిషను నడిపి, పంటలకు కుదిరే పినతల్లీ ఇంత ఐశ్వర్యాన్ని ఎలా పోగుచేశారు? ఆలోచిస్తే మీకే తెలుస్తుంది" సాలోచనగా గడ్డం నిమురుకుంటూ అన్నాడు యాంకర్.

ఇల్లంతా వివరంగా చూపిస్తున్నారు. కలర్ టీవీ, పెద్ద ఫ్రిజ్, ఏసీ గది, దిట్టంగా నగలు దిగేసుకున్న పినతల్లీ... వ్యాఖ్యానం జరిగినంత సేపూ, క్లోజప్‌లో చూపిస్తున్నారు.

"ఇంత డబ్బెక్కడిది? వెర్రి గొర్రెల వంటి ప్రజల డబ్బు, చూస్తున్నారుగా. సంతానం లేని వారి దగ్గర, జబ్బు మనుషుల దగ్గర, పెళ్లిగాని కన్యల తండ్రుల దగ్గర.. ఒకటేమిటి? ప్రతిదానికీ రేట్లు కట్టి మరీ దండుకుంటుందీ పాప! ఈ ఊళ్లో ఇక నాటకం ముగిసింది అనిపించగానే బిచాణా ఎత్తేస్తుంది.

ఏమీ తినదు, తాగదు, నిద్రపోదు అని ప్రచారం చేసుకునే ఈ మేక వన్నెపులి చేసే పనులు ఆరితేరిన గుండెలు తీసిన బంట్లు మాత్రమే చెయ్యగలరు" ఇలా చెబుతున్నప్పుడు, నిశ్చలంగా నిర్మలంగా, నిటారుగా, కూర్చున్న అమ్మల్ని పదేపదే చూపించారు.

"అసలు కథ ఇప్పుడు మీ ముందుంచుతున్నాం" అంటూ మొదలెట్టాడు మళ్లీ. అందరూ వెళ్లగానే తలుపులు వేశాక ఆ ఇంట్లో జరిగే తంతును ప్రతీ గదిలో అమర్చిన సీక్రెట్ కెమెరాలు సవివరంగా బంధించాయి.

భక్తులందరూ వెళ్లిపోయాక సదాశివం తలుపులు బిగించటం, వచ్చినవారిని, ముడుపులు ఇవ్వని వారిని, తక్కువ ఇచ్చిన వారినీ ఆడిపోసుకోవటం, కొబ్బరికాయలు, పసుపుకుంకాలు అమ్మకం కోసం సిద్ధం చేయటం

## ఈషా దశ తిరిగేనా?



గతంలో తన కొడుకులు సన్నీ-బాబీ డియోల్‌లతో కలిసి 'అప్నే' అనే సినిమాలో తండ్రిగా నటించాడు ధర్మేంద్ర. ఇప్పుడు తన కూతురు ఈషా కోసం ఇలాగే నటించబోతున్నాడు. ఈషా నిజజీవిత తల్లిదండ్రులు హేమమాలిని-ధర్మేంద్రలు 'టెల్ మీ ఓ ఖుదా' అనే సినిమాలోనూ పేరెంట్స్‌గా కనిపించబోతున్నారట. ఇందులో ఈషా చాలావరకు డీగ్లామరైజ్డ్‌గా నటిస్తుందిట. ప్రస్తుతం అంతంత మాత్రంగానే వున్న ఈషా సినీ కెరీర్‌కి ఈ సినిమా ఎంతవరకూ ప్లస్ అవుతుందో!

చూపించారు.

అమ్మలు బాత్రూంవైపు పరిగెట్టటం చాలాసార్లు చూపించారు.

"అమ్మలు అమ్మోరు కాదు అనటానికి ఇదే మొదటి ఋజువు" అంటూ మూసి ఉన్న బాత్రూం తలుపును క్లోజప్‌లో చూపించారు.

బయటికి వచ్చిన అమ్మల్ని పినతల్లి నిష్ఠూరాలాడటం, నగలన్నీ వలిచి దాచటం చూపించారు. "ఎక్కడివిన్ని నగలు?" అని జనాల్ని ప్రశ్నించాడు యాంకర్.

అమ్మలు ఆకలికి ఆగలేక అన్నం పెట్టమని అడగటం, అవురావురుమని తినటం, పినతల్లి వేసే మొట్టికాయలు, పెట్టే చివాట్లు వివరంగా చూపించారు.

అమ్మలు కంచంమీద కెమేరాను కేంద్రీకరించి చిన్నచేతులతో ముద్దచేసి నోట పెట్టుకోవటం, నమిలి మింగటం, మళ్లీ ముద్ద కలపటం.. ఇలా అన్నం తిన్నంతసేపూ చూపించి, భీకరంగా నవ్వాడు యాంకర్.

"అమ్మలుకు కూడా ఆకలి వేస్తుంది. చూడండి, బాగా చూడండి. పట్టెడు మెతుకులు కూడా కతకదని చెప్పుకునే అమ్మోరి నిజరూపం! ఆబగా, ఆకలిగా, ఒక మామూలు మానవమాత్రురాలిలాగా ఎలా తింటున్నదో చూడండి" తిన్నంతసేపూ చెబుతూనే ఉన్నాడు. కెమేరా పడకగదిలో అమ్మలు పడుకోవటం చూపించింది. "నిద్రపోనే పోదని చెప్పుకునే పిల్ల ఒళ్లు మరిచి ఎలా నిద్రపోతుందో చూడండి! ఇందర్ని మోసం చేసే ఈ ఎనిమిదేళ్ల పిల్లకు ప్రశాంతంగా నిద్ర ఎలా పడుతుంది? ఆత్మనుద్ధరిస్తుందని చెప్పుకునే ఈ పిల్లకు అంతరాత్మ లేదా?" ప్రశ్నలు గుప్పిస్తున్నాడు.

"ఎన్నో కష్టాలకోర్చి ఈ స్టింగ్ ఆపరేషన్ నడిపించాము. ఎందుకు? ప్రజలకు కనువిప్పు కలిగించటమే మా ఛానెల్ ధ్యేయం కాబట్టి! ఎనిమిదేళ్లకే ఆరితేరిన ఈ మోసగత్తె పద్దెనిమిదేళ్లకు ఎంత తెలివిమీరిన క్రిమినల్‌గా రూపుదిద్దుకుని తన అందచందాలతో ఎందరిని ఎన్ని విధాల వంచిస్తుందో అంచనా వెయ్యటం మీ ఊహకే వదిలేస్తున్నాం. ఇలాంటి బూటకాల బుల్లిపాపల్ని చూచి జాలిపడటం కూడా ఒక మూర్ఖత్వమే! తస్మాత్ జాగ్రత్త!" అని ముగించాడు.

ఇలా 'ఆపరేషన్ అమ్మలు', ఛానెల్ లెఖ్ఖ ప్రకారం విజయవంతంగా ప్రసారమైంది. చాలామందికి ఆ రాత్రి నిద్ర రాలేదు. టీవీలో పదేపదే చూపించిన తమ వెర్రిమొహాలను మర్నాడు అద్దంలో కూడా చూసుకోబుద్ధి కాలేదు. తమను అమ్మలు దగ్గరికి తీసుకెళ్లిన వాళ్లను బండబూతులు తిట్టుకున్నారు. టీవీ 'స్టింగ్ ఆపరేషన్' రకరకాలుగా మనుషుల్ని ఇరుకున పెట్టింది.

మర్నాడు పొద్దున ఏడు గంటల ప్రాంతంలో దాదాపు వందమంది గుంపుగా అమ్మలు ఇంటికి చేరారు.

దేవీనవరాత్రులు ఆఖరి రోజు.

అప్పటికే దూరదృష్టికల టీవీ ఛానెళ్ల వ్యానులు రెండు, మూడు అక్కడ రెడీగా ఉన్నాయి. కొందరు చొరవగల రిపోర్టర్లు మైక్రోఫోన్లతో నవ్వుతూ ఎదురొచ్చారు. "ఏమిటలా గుంపుగా వచ్చారు? విజయదశమి దర్శనం కోసమా?" అడిగాడొక కుర్ర రిపోర్టు.

"నీ బొంద (ఇది ఎడిట్ చేశారు)... మోసం జరిగింది మొర్రో అని అందరం నిలదీయటానికి వచ్చాం" ఒక పెద్దాయన వినుగ్గా చెప్పాడు. ఆయన కూతురు పెళ్లి కుదరటం కోసం ముందురోజే ముడుపు సమర్పించాడు. కూతురికి పెళ్లిగాక అవస్థ పడుతున్నాడనే విషయాన్ని టీవీ ఛానెల్ బాగానే కవర్ చేసింది. ఈ పబ్లిసిటీతో పిల్లకు జన్మలో పెళ్లికాదనే భయం పట్టుకుందాయనకు!

"ఏం చేద్దామనుకుంటున్నారు మీరంతా? వాటీజ్ యువర్ ప్లాన్ ఆఫ్ ఏక్షన్?" జీన్స్‌పాంట్ రిపోర్టర్ చనువుగా ఇంకొకర్ని అడిగాడు.

"అనుకునేదేముంది నీ బూడిద (ఎడిట్ చేశారు)? ఎవరిచ్చింది వాళ్లు వసూలు చేసుకుపోదామని వచ్చాం" ఆరు ఉంగరాలాయన అరిచాడు కోపంగా.


అంతకు ముందే ఆయనకు గిట్టని వాళ్ల దగ్గర నుండి ఆకాశరామన్న ఫొనొచ్చింది. "పిల్లలు పుట్టారా? బారసాల ఎప్పుడు?" అనడుగుతూ, పుండుమీద కారం చల్లినట్లు మండిపడుతున్నాడాయన.

గుంపులో నుండి ఒక బాధితుడు తనంతట తానే ముందుకు వచ్చాడు. రిపోర్టరు సంతోషించి "రండి సార్.. చెప్పండి! మా ప్రేక్షకులు వింటున్నారు. ప్రభుత్వం వింటోంది" అన్నాడు.

"ఈ చేసే ప్రసారమేదో నాల్రోజుల క్రితం చేసుంటే చాలామందిమి బోల్తాపడే వోళ్లం కాదుకదా!" అన్నాడు రిపోర్టరు ముఖంలో ముఖం పెట్టి తప్పంతా మీదే అన్నట్లు, రిపోర్టరు ఒక్క పిసరు జంకినట్లు కనబడ్డాడు.

"జరిగే మోసం అంతా జరిగిపోయాక మహా గొప్పగా వస్తారయ్యా టీవీలో చూపించటానికి.. యదవన్నర యధవలు" కాస్త ధైర్యం, చొరవా కల మాజీ విద్యార్థి నాయకుడు టీవీ వాళ్లకు చురక అంటించాడు.

చుట్టూ తిప్పి చివరికి మోసగాళ్ల మీది కోపమంతా టీవీ ఛానెల్‌దే తప్పు అన్న దిశలో సాగు



## విమల అదృష్టం

కొంతమంది తారలకు హిట్లు లేకపోయినా అవకాశాలు అలా వస్తూనే వుంటాయి. అలాంటి వారిలో విమలా రామన్‌ని కూడా చేర్చవచ్చు. ఇప్పటి దాకా విమలకి తనదైన హిట్ సినిమా లేదు. ఇటీవల కన్నడంలో వచ్చిన 'ఆప్తరక్షక' ఒక్కటే విమలకి లభించిన మొదటి పెద్ద హిట్టుగా చెప్పాలి. తాజాగా ఆమెకి ఓ ఇంగ్లీషు సినిమా చాన్స్ కూడా లభించింది. 'డేమ్ 999' అనే సినిమాలో హీరోయిన్‌గా ఎంపికైందిట విమల. మొదట ఈ పాత్రకి శ్రియని అనుకున్నారట. కానీ చివరి నిమిషంలో ఆ అవకాశం విమలని వరించింది.

తోందనే భయం మొదలైంది. ఆ పరిస్థితిలో మాట మారుస్తూ "రండి లోపలికి వెళదాం" అంటూ టీవీ కెమెరాలు ఇంట్లోకి దారితీశాయి.

దీపాలతో, మనుషులతో, లైట్ల వెలుగులో కళకళలాడే ఇల్లు శూన్యంగా, చీకటిగా ఉంది. మనుషులంటూ ఎవరూ లేరు.

ఒక గదిలో ఉయ్యాలబల్ల మీద ఒక ఆసామీ కూర్చుని ఉన్నాడు.

ఒక కాలు వేలాడదీసి, రెండో కాలు బల్ల మీద పెట్టుకుని, మోకాలి మీద తల ఆనించుకుని ఉన్నాడు. కేమెరా లైటు అతని మీద ఫోకసు చేశారు.

నెత్తిన గళ్ల తుండుగుడ్డ వేసుకుని, దివాలా తీసిన ముఖంతో దీనంగా చూశాడతను.

"మీరు అమ్మలు చుట్టాలా?" రిపోర్టరడిగాడు.

టీవీ కెమెరాల్నీ, జనాన్నీ చూసి నెత్తిన చేతులెత్తి దణ్ణం పెట్టాడతను.

"నాకు వాళ్లెవరో కూడా తెలీదయ్యా మగడా, ఇది నా ఇల్లు, చిల్లిగవ్వ అద్దె ఇవ్వకుండా తెల్లరగట్ల ఉడాయించారు" ఏడుపొకటి తక్కువగా అన్నాడతను.

"అద్దె ఎందుకు తీసుకోలేదండీ? సాధారణంగా ఎడ్వాన్సు లేకుండా ఇంట్లోకి రానివ్వరే ఎవరయినా!" ప్రశ్నించాడు రిపోర్టరు.

"బుద్ధి గడ్డితిని" నుదురు టపాటపా బాదుకున్నాడు.

"నెలనెలా రెండువేలు కావాలా? ఏడాదికి యాభై వేలు కావాలా? అని అడిగాడయ్యా ఆ సదాశివంగాడు. నెలనెలా తీసుకుంటే ఏడాదికి పాతికవేల కంటే తక్కువ గదా అని ఆశపడ్డాను. ఇలా జరుగుతుందనుకోలేదు"

"ఓ.. అలా చెప్పండి! ఆశపడి గోతిలో పడ్డారన్నమాట! ప్రేక్షకులకు హెచ్చరిక! డబ్బుకు కక్కుర్తిపడి ఉచితంగా ఇళ్లు అద్దెకు ఇవ్వకండి" కొత్త పాయింటు లేవదీశాడు రిపోర్టరు.

జనం తోసుకుని ముందుకొచ్చారు. "ఇంతకీ ఆ పాడు పిల్లా, పెద్ద పీనుగులు ఏరయ్యా?" అన్నాడొకాయన.

"ఏమో! ఎవరికి తెలుసు? తెల్లారుఝామున పాలవాడు వచ్చినప్పుడు ఇల్లు ఖాళీ అని చెబితే తెలిసి లబోదిబోమని వచ్చాను"

"పోలీసు రిపోర్టిచ్చారా?" రిపోర్టరడిగాడు.

"అదేంటి? టీవీవాళ్లివ్వరా పోలీసులకు రిపోర్టు?" అక్కడున్న జనమంతా ముక్తకంఠంతో ప్రశ్నించారు.

"ఇల్లొదిలి పారిపోతే ఇంటి యజమాని రిపోర్టివ్వాలి. డబ్బులు దండుకుని మోసం చేస్తే దగాపడిన వాళ్లు రిపోర్టివ్వాలి. టీవీ ఛానెల్ ఎందుకిస్తుంది?" అన్నాడు రిపోర్టరు.

"అదేందయ్యా అట్టా మాట్లాడతావ్? మీరు టీవీలో చూపించబట్టే కదా వాళ్లు ఇల్లొదిలి, అద్దె ఎగేసి రాత్రికి రాత్రి పారిపోయింది! డబ్బా గల్లంతు. మనుషులూ గల్లంతు. ముందు మీ మీద రిపోర్టివ్వాలి" ప్రజలూ, ఇంటి యజమానీ ప్రశ్నల వర్షంతో రిపోర్టరు మీద విరుచుకుపడ్డారు.

'డామిట్ కథ అడ్డం తిరిగింది' అనుకునే వ్యవధి కూడా లేనందువల్ల కళ్లు మూసి తెరిచేలోగా ఛానెల్ల వ్యాన్‌లు శరగవేగంతో మాయమైనాయి.

★ ★ ★

ప్రశాంత వాతావరణంలో బొమ్మరిళ్లల్లాగా కొండల మధ్య కట్టబడిన స్కూలు, ఆడపిల్లల అనాథ శరణాలయం, పిల్లలు పచ్చికలో గుంపులుగా ఆడుకుంటున్నారు. నీరెండలో ఆరుబయట కూర్చోవటం ఆ పాపకు హాయిగా ఉంది. ఉడికించిన జొన్నవిత్తులు తింటూ పడక కుర్చీలో కూర్చుందా అమ్మాయి.

ఇంతలో నుదుట చల్లగా తగిలిన స్పర్శకు తలెత్తి చూసింది. సులోచనా టీచర్ నిలబడి ఉన్నది.

"జ్వరం పూర్తిగా తగ్గిందా తల్లీ, ఇదిగో ఆఖరి టాబ్లెట్ ముందు వేసుకుని నీళ్లు తాగు"

"కాళ్లు బాగా నొప్పులు టీచర్"

"చూడమ్మా అమూల్యా! నువ్వు బాగా విశ్రాంతి తీసుకోవాలి. డాక్టర్ గారు చెప్పే ఎక్సర్‌సైజులు చెయ్యాలి. ఇంజక్షన్లూ, ఈ నొప్పుల కోసం ఇచ్చే మందులూ జాగ్రత్తగా టైం ప్రకారం తీసుకోవాలి. అప్పటికిగానీ నీ కాళ్లనొప్పులూ, నడుమునొప్పీ తగ్గవు" తల నిమురుతూ అన్నదామె.

తల ఊపింది అమూల్య.

"వాళ్లందరినీ చూడు. నువ్వు వాళ్లల్లాగే చదువుకోవాలి. ఆడుకోవాలి. మంచి పిల్లవనిపించుకోవాలి"

మళ్లీ తల పంకించింది అమూల్య. ఇంతలో సందేహం కలిగి "మంచి పిల్లనని ఎలా అనిపించుకోవాలి టీచర్?" అమాయకంగా ప్రశ్నించిన పసిపాప దగ్గరగా స్టూలు లాక్కుని కూర్చున్నదామె.

"ముందుగా.. అబద్ధం ఆడకూడదు. నీ గురించి ఎవరైనా అబద్ధం చెబితే ఒప్పుకోగూడదు, అర్థమైందా?"

"అబద్ధం ఆడను టీచర్, కానీ ఇంకెవరైనా నా గురించి అబద్ధాలు చెపితే నేనేం చెయ్యాలి?" నిస్సహాయంగా అడిగింది అమూల్య.

"అబద్ధం అంటేనే మోసం. లేనిదాన్ని ఉన్నట్లు చెప్పకూడదు. అది చాలా తప్పు. నీ గురించి ఇంకెవరో అలా చెప్పినా నువ్వు కాదనాలి. ఒప్పుకోకూడదు. నీకు తెలిసిన నిజం నువ్వు చెప్పాలి. ఎవరైనా మనల్ని అబద్ధం ఆడమని చెప్పినా, మన గురించి అబద్ధాలాడినా వాళ్లు మన మంచి కోరే వాళ్లు కాదని తెలుసుకోవాలి. తెలిసిందా?"

సులోచనా టీచర్ చెప్పినది సూటిగా ఆ చిన్నపిల్ల హృదయాన్ని తాకింది. "ఓ తెలిసింది టీచర్" అన్నది సాలోచనగా.

★ ★ ★

"నీలాంటి పిల్లలు చక్కగా పెరిగి మంచి మనుషులు కావాలంటే కొన్ని పనులు చెయ్యాలమ్మా"

"అలాగా! ఏమిటవి టీచర్?!"

"పొద్దున లేవాలి. బ్రష్ చేసుకొని పాలు తాగి స్నానం చేయాలి. ఇంత చక్కటి జీవితాన్నిచ్చిన దేవుడిని తలుచుకోవాలి. టిఫిన్ తిని బడికి వెళ్లాలి. ఇష్టమొచ్చినట్లు కాదు. అందరి పద్ధతిలో తయారై, యూనీఫారం వేసుకుని, పుస్తకాల సంచీ, నీళ్ల బాటిలూ, టిఫిన్ బాక్సూ పట్టుకు వెళ్లాలి. పాఠాలను జాగ్రత్తగా వినాలి. తెలియనివి టీచర్ని అడిగి తెలుసుకోవాలి. ఆడుకునే సమయంలో నేస్తాలతో గొడవలు పడకుండా, మాట్లాడుకోవాలి. ఆడుకోవాలి, కలిసి భోజనం తినాలి. నీ దగ్గర ఉన్నదేదో వాళ్లకి కూడా కాస్త పెట్టాలి. వారు ఇచ్చింది కూడా తీసుకోవాలి. అందరితోనూ స్నేహంగా ఉండాలి. పొట్లాటలు రాకుండా నవ్వుతూ మాట్లాడాలి. చెయ్యగలిగినప్పుడు ఎవరికైనా సరే నీకు చేతనైన సహాయం చేయాలి"

"సహాయం ఎలా చెయ్యాలి టీచర్? వాళ్లు మనకు ఏమిస్తారు?" అడిగింది ఆ పాప.

"అమ్మా అమూల్యా! ఎవరి దగ్గర ఏదీ తీసుకోకుండా చేసేదాన్నే సహాయం అంటారు. ఒకరికి ఏదైనా చేసి పెడతామని చెప్పి వారి దగ్గర ఏదైనా తీసుకుంటే దాన్ని వ్యాపారమంటారు!"


పిల్లలు లేని వాళ్ల దగ్గర, రోగిష్టి వాళ్ల దగ్గర, పెళ్లికాని వాళ్ల దగ్గర ముడుపుల పేరుతో డబ్బు వసూలు చేసే పిన్నీ, బాబాయి గుర్తొచ్చారు.

"ఆహా! దాన్ని వ్యాపారమంటారా?" అన్నది చిన్నబోయిన ముఖంతో. "మంచి పిల్లలుగా ఎదగాలంటే మంచి ఆలోచనలు, మంచి అలవాట్లూ కలిగి ఉండాలమ్మా. అవన్నీ వారం రోజుల్లో అబ్బేవి కావు. నీ అంతట నువ్వే అందర్నీ చూచి చక్కగా నేర్చుకుంటావుగా, దిగులెందుకు?" అంటూ ఆ పసిపిల్లను దగ్గరకు తీసుకుంది సులోచనా టీచర్.

చిన్ననాటి నుండీ మాతృవాత్సల్యానికి, ఆదరణకూ దూరమైన ఆ పసిదాని కళ్లు ఆర్ద్రమైనాయి.

★ ★ ★

సులోచనా టీచర్‌ది అమూల్య వాళ్ల ఊరే. ఆమె ఒక గొప్పింటి కోడలు. పెళ్లయిన కొద్దికాలానికే భర్తను కోల్పోయింది. చదువు, సంస్కారం కల స్త్రీ కాబట్టి పుట్టింటా, అత్తింటా గాంధేయవాదులు కాబట్టి, పల్లెలో ఆడపిల్లల శ్రేయస్సుకి పాటుపడాలని నిర్ణయించుకున్నది.



కుటుంబ సభ్యుల సహకారంతో ఒక బాలికల అనాథ శరణాలయాన్నీ, పాఠశాలనూ స్థాపించింది. పేద కుటుంబాల ఆడపిల్లలంతా అక్కడ చేరి చదువుకోసాగారు.

యోగాభ్యాసం, చదువు సంధ్యలే కాక గృహజీవనానికి ఉపకరించే మౌలిక విద్యలను కూడా ప్రవేశపెట్టింది. ఆ చుట్టుపక్కల ప్రజలు కూడా సులోచనా టీచర్ విధానాలను హర్షించి తమ పిల్లలను అక్కడికి పంపారు. సమాజ శ్రేయస్సుకి పాటుపడే వ్యక్తిగా ఆమె గౌరవింపబడుతోంది. అమూల్య తండ్రి సులోచనా టీచర్ స్కూలులో పనిచేసేవాడు. ఒక బస్సు ప్రమాదంలో తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్న అమూల్యను పిన్ని బాబాయిలైన భవానీ, సదాశివం బడి మాన్పించి 'అమ్మలు' అనే అవతారగాథ ప్రారంభించారు. వ్యాపారంలో అమూల్య పేరు కూడా మరుగున పడిపోయి 'అమ్మలు'గా కళంకితమైంది.

మొదట తరగతిలో అమూల్య ఆ బడిలో చదివేటప్పుడు చురుగ్గా, అందంగా చలాకీగా ఉన్నందున అందరూ ముద్దు చేసేవారు. సులోచనా టీచరు మరీను. అమూల్య పట్ల ఆమెకు మాతృవాత్సల్యం కలిగేది.

ఆ ఆనందమయ బాల్యం నుంచి పూర్తిగా విడివడి పినతండ్రి చేతిలో కీలుబొమ్మగా కృత్రిమ జీవితంలో అడుగుపెట్టింది అమూల్య. మైనం ముద్ద వంటి ఆ అమాయకురాల్ని ఆకలి దప్పులు, నిద్ర, విశ్రాంతి వంటి మౌలికావసరాలకు దూరం చేసి ఎడతెగని, సత్యదూరమైన పాత్రపోషణలోకి దింపారు ఆ స్వార్థపరులు.

తనెవరో, తన ఉనికేమిటో ఆ పసిదానికి అర్థం కాకుండా పోయే స్థితి వచ్చింది. తానొక మామూలు పసిపాపననీ, తల్లిదండ్రుల రక్షణా పోషణా, స్నేహితుల ఆటపాటలూ, అల్లరీ, బడిలో చదువు మొదలైన రోజువారీ కార్యక్రమాలు తన ఎదుగుదలకు అవసరమనీ ఆ పాప గ్రహించే వెసులుబాటే లేకుండా చేశారు పిన్నీ బాబాయిలు.

టీవీ ప్రసారం వల్ల రేగే దుమారాన్ని ఊహించి, డబ్బూ, నగా-నట్రా సర్దుకుని సదాశివం, భవానీ జంట ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోయి అనామకంగా బ్రతకదలిచారు. ఎవరిని అడ్డం పెట్టుకుని సంపద పోగుచేశారో, ఆ పిల్లను మాత్రం వాళ్లు ఆ పరిస్థితిలో గుదిబండగా భావించారు. అందుకనే శాశ్వతంగా వదిలించుకోదల్చుకున్నారు. ఆ పాప తమ దగ్గర ఉంటే ఏనాటికైనా తమ ఉనికి బయటపడి జైలుపాలయ్యే ప్రమాదం ఉంటుంది కనుక తమ స్వంత ఊరి దగ్గర ఉన్న సులోచనా టీచర్ బాలికల శరణాలయం దగ్గర గుమ్మంలో వదిలి పారిపోయారు.

జ్వరంతో, పలు రకాల ఆరోగ్య సమస్యలతోనూ మౌనంగా, విచారంగా ఉండే అమూల్యను అక్కున చేర్చుకుంది సులోచనా టీచర్. టీవీ ప్రసారంలో చూసి ఉండటం వల్ల తమ ఊరి వాళ్లైన సదాశివం దంపతులను గుర్తించింది. అమూల్య తండ్రి తమ దగ్గర పనిచేసిన టీచరనీ, అమూల్య తన బడిలో చదివి, మాన్పించబడిన విద్యార్థి అనీ తెలుసుకుని, జరిగినదంతా అర్థం చేసుకున్నది. జరిగిన ఘోరమంతా విని బాధపడినా, భగవంతుడు బిడ్డను వీధిపాలు చెయ్యకుండా సరైన చోటుకి చేర్చాడనే భావనతో ఊరటపొంది ఆనందించింది. వారం రోజులు సపర్యలు చేసి, ఆదరించిన తరువాత కొద్ది కొద్దిగా తేరుకుంటున్న అమూల్య జరిగినవన్నీ తనకు అర్థమైన విధంగా చెప్పింది.

అలా.. పదకొండు నెలలు గడిచాయి. అమూల్య అందరిలోనూ ఒకరిగా కలగలిసి పోయింది. చదువు, ఆటపాటలూ, శారీరక వ్యాయామాలు, వేళపట్టున స్నానం, నిద్ర, భోజనం.. ఇవన్నీ తోటంతా తుళ్లిపడుతూ ఎగిరి సీతాకోక చిలుకలా అమూల్యను తయారుచేశాయి.

తోటి పిల్లలతో హాయిగా ఆడుకోవటం, మాట్లాడుకోవటం, టీచర్ల పట్ల వినయవిధేయతలతో మెలగటం, అన్నింటా ముందుండటం అమూల్యకు సహజంగా అలవడ్డాయి.

సెప్టెంబర్ నెల ఐదో తారీకు, 'ఉపాధ్యాయ దినోత్సవం'. రాష్ట్రపతీ, కలెక్టరూ, శాస్త్రవేత్త, ఇంజనీరూ, డాక్టరు వంటి ఉత్తమ పౌరుల నుంచి సామాన్యుడి దాకా ప్రతీవారు తమను అంతటివారిని చేసిన గురుదేవులను స్మరించి నమస్కరించవలసిన అతి ముఖ్యమైన రోజు.

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరించే శుభ సమయం. జాబితాలో మొదటి పేరు సులోచనా టీచరుదే! పల్లె ప్రాంతాలలో ఉండీ కూడా భర్తను కోల్పోయి తన జీవితాన్ని శోకమయం, నిరర్థకం కానివ్వకుండా విద్యాసేవకు, తద్వారా సమాజ శ్రేయస్సుకు అంకితం చేసి పల్లెలలోను, చిన్న జిల్లాలోను ఆడపిల్లలకు వసతి, వైద్యం, విద్యలను ఉచితంగా అందిస్తున్న ఏకైక మహోన్నత వ్యక్తిగా ఆమెను ప్రభుత్వం గుర్తించి, శ్లాఘించి సన్మానించింది.

ఆ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యాశాఖామాత్యులు, కలెక్టరుగారు, పోలీసు కమిషనర్‌గారు ఆమెను సత్కరించారు. అదే వేదిక మీద పౌర సన్మానం కూడా ఆమెకు జరగటం ఒక చెప్పుకోతగ్గ విశేషం.

ఆమెను సభకు పరిచయం చేస్తూ ఒక ఉపాధ్యాయినిగా, బాలికల శ్రేయస్సు కోసం తపిస్తూ శ్రమిస్తున్న ఒక సమాజ సేవికగా తన అనుభవాన్ని నలుగురితో పంచుకొమ్మని, అది అందరికీ స్ఫూర్తినిస్తుందనీ కోరారు. ఆమె వంటి వారు పదిమంది ఉంటే బాలికల భవితకు బంగారు బాట వేస్తారని మంత్రిగారు ఆశాభావం వ్యక్తం చేశారు.

నిగర్వి, వినయశీలి అయిన సులోచనా టీచర్ అందరికీ నమస్కరించింది. ఆమె సహజ గంభీర స్వరం వేలాది మంది చెవుల్లోనే కాక, టీవీ ఛానెళ్లలో కూడా ప్రతిధ్వనించింది.

"అందరికీ నమస్కారం. నా చిన్ని ప్రయత్నాలకు ఈ సన్మానం రూపంలో ప్రోత్సాహమనే ప్రాణదానం చేశారు. నేనందుకు సర్వదా కృతజ్ఞురాలను" అంతా హర్షాతిరేకంతో చప్పట్లు చరిచారు.


"మీరు గమనించే ఉంటారు. పిల్లలు ఎవరు చెప్పినా వినని విషయాలను కూడా టీచరు చెబితే వింటారు, గురుస్థానం అలాంటిది. నాకు మీరు చేస్తున్న ఈ గౌరవ మర్యాదలు నా గురువులకు సమర్పిస్తున్నాను. నా అనుభవాల్ని మీతో పంచుకొమ్మన్నారు. ఇవాళ ఇక్కడ నేనొక చిన్న కథను చెబుతాను. అంటే ఒక చిన్నపిల్ల కథ అన్నమాట. అది అక్షరసత్యం. అందరూ తెలుసుకోవలసిన కథ. నేను చెప్పేది అమూల్య కథ"

అంతా ఆసక్తిగా వింటున్నారు.

"అమూల్య ఎనిమిదేళ్ల పాప. తల్లీదండ్రీ పసితనంలోనే ప్రమాదంలో చనిపోయారు. విధివశాన పినతండ్రి, పినతల్లి ప్రాపకంలో పడింది. అమూల్యను 'అమ్మలు' అనే మారుపేరుతో 'అమ్మోరు'గా చెలామణి చేశారు. దుర్గాదేవి అవతారమనీ, అన్నం, నీరు ముట్టదనీ, నిద్రపోదనీ, ఊరూరా ప్రచారం చేశారు. మొక్కి, మొక్కుబడులు చెల్లిస్తే కోరికలు తీర్చే దేవత అని నమ్మించి ఆ పసిదాని పేర్న డబ్బులు దండుకున్నారు. ఆ పసిబిడ్డను డబ్బు సంపాదించే యంత్రాన్ని చేసి తమ చేతిలో కీలుబొమ్మగా ఆడించసాగారు"

అందరికీ కథ ఎవరి గురించి చెప్తున్నదో అర్థమైంది. గుసగుసలు మొదలైనవి. అందరికీ తెలిసిన ఈ కథ టీచర్ ఎందుకు చెబుతుందా అని ఆలోచించసాగారు.

"ఖాళీ కడుపు, ఒంటినిండా నగల బరువు.. తెల్లవారిన దగ్గర్నుంచీ దేవతలాగా నటించాలి. గంటలతరబడి నిటారుగా కూర్చోవాలి. బాధ, నొప్పి కలిగినా సోలకూడదు. శరీరావసరాలకు కూడా లేవకూడదు. మరీ అవసరమైతే దొంగచాటుగా, అందరి కళ్లూ కప్పి వెళ్లాలి. ఆకలీ, దప్పికా ఓర్చుకోవాలి. నిద్ర తూలుతున్నా రెప్పవాల్చకూడదు. అందరూ సమర్పించేవి స్వీకరించాలి. వచ్చిన జనమంతా వెళ్లిన తరువాతగానీ తనకు అవసరమైన పనులు చేసుకోవానికి లేదు. తెల్లవారు ఝాము నుంచీ మళ్లీ దినచర్య మొదలు. ఒక చదువూ సంధ్యా, తిండీతిప్పలూ, ఉలుకూపలుకూ ఏదీ లేని బాల్యం. కన్ను తెరిచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే దాకా నటన తప్ప ఇంకేదీ లేదు. ఏడుపొస్తే ఏడవకూడదు. నవ్వొస్తే నవ్వకూడదు. కదిల్తే తప్పు, మెదిల్తే తప్పు. ఆకలి అన్న మరుక్షణం మొట్టికాయలూ, చివాట్లూనూ..



అందరూ వచ్చి హుండీలో ముడుపులు చెల్లిస్తారు. ఆ డబ్బు ఎంత ఉందో, ఎందు నిమిత్తం ఎవరికిస్తున్నారో ఆ పసిబిడ్డకు అర్థం కూడా కాదు. పోనీ ఆ పిల్లను అడ్డం పెట్టుకుని దండుకుంటున్న ఆ డబ్బుల్లో ఒక రూపాయి అయినా పిల్ల శ్రేయస్సుకో, భవిష్యత్తుకో ఉద్దేశించబడిందా అంటే అదీ లేదు. పేరొకరిది, పెన్నిధొకరిది. అందరి ముడుపులకూ ఈ చిన్నపిల్లే బాధ్యురాలా!

మీడియా పాత్ర నేటి కాలంలో చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. అందరికీ తెలిసిందే. ప్రపంచంలో ఏం జరుగుతుందో పల్లెల్లో, చిన్న గ్రామాలలో కూడా మనం కళ్లారా చూచి తెలుసుకునేంతగా విజ్ఞానం అభివృద్ధి చెందింది. ఇది కేవలం మీడియా వల్లనే సాధ్యం.

ఎన్నో గొప్ప విషయాలను, గొప్ప వ్యక్తులకే కాక నేరాలనూ, అన్యాయాలనూ, వంచనలనూ, ఉపద్రవాలనూ మీడియా చిత్తశుద్ధితో ప్రజల ముందుకు తెస్తోంది. దుర్మార్గుల విచ్చలవిడితనం మీడియా భయానికి చాలావరకూ తలఒగ్గింది. కీచకులూ, లంచగొండి వాళ్లు 'జంకు' అనేది మీడియాకి జడిస్తే నేర్చుకుంటున్నారు. దేశద్రోహులు, ఇంటి దొంగల గుట్టురట్టు చేస్తుంది మీడియా"

పాత్రికేయులు చెవులు చిల్లులు పడేలా చప్పట్లు కొట్టారు.

"చంద్రుడుకే మచ్చ తప్ప లేదు. అమ్ములు కథ కదూ మనం చెప్పుకుంటున్నది? టీవీవాళ్లు నిఘా వేశారు. ఈ విషయంలో ఏం జరిగిందో మీరంతా టీవీలో చూసి ఉంటారు.

ఒకరి దయాధర్మాల కింద బతుకుతున్న నిస్సహాయురాలు అమ్ములు. వాళ్లు చెప్పింది చెప్పాలి. చెయ్యమన్నట్టు చెయ్యాలి. ఇదీ అక్కడి చట్టం. రాత్రి దొరికే ఆ పట్టెడు మెతుకులు కూడా దొరకవేమోననే భయం.

'ఆపరేషన్ అమ్ములు' అనబడే టీవీ స్టింగ్ ఆపరేషన్ ఆంధ్రదేశమంతా చూసింది. చూడని వాళ్లు రిపీట్ టెలీకాస్టులలో చూసి తరించారు. ఏం చూపించారు? ఏమని వ్యాఖ్యానమిచ్చారు?

అమ్మోరి వేషంలో పసిబిడ్డను కూర్చోబెట్టటం చూపించారు. ఆ బిడ్డ అంతకుమించి ఏదైనా అన్నదా, చేసిందా? కదలకుండా, మెదలకుండా కూర్చునే ఉన్నది. ఆ పాప ధరించిన పాత్ర అంతవరకే.

జరిగిన తంతు వేరే విధంగా ఉన్నది. పిన్ని, బాబాయి అమ్ములు దైవాంశం గల బిడ్డ అని ప్రచారం చేస్తూండడం చూపించారు. రకరకాల సమస్యలతో బాధపడుతున్న జనాన్ని చూపించారు. వారు స్వచ్ఛందంగా తమకు తామే ముడుపులు చెల్లించటం చూపించారు. ఆ ముడుపుల్ని ఈ పసిబిడ్డ ముట్టుకోనైనా ముట్టుకుందా? లేదే.

ఆ డబ్బంతా పినతండ్రి లెక్కించటం, పినతల్లి దాచటం చూపించారు. జనం వెళ్లిపోయిన క్షణమే అమ్ములు బాత్రూం వైపు పరిగెత్తింది. అది ఎంతో జాలి పడవలసిన విషయమని ఎవ్వరికీ తట్టలేదా? పసిపిల్ల ఆత్రంగా, ఆకలిగా అన్నం తినటం చూసిన వాళ్లకు ఆ బిడ్డ పట్ల సానుభూతి కలిగి మనసు కరగలేదా?

ప్రతి ముద్దా నోట పెట్టుకోవటం, తినటం పదేపదే చూపించారు. 'మానవ మాత్రురాలిగా తింటోంది. చూడండి' అంటూ.

'ఇందర్ని వంచించి ఎలా నిద్రపోతోందో చూడండి' అంటూ వ్యాఖ్యానించారు. ఆ పసిబిడ్డ తన దైవత్వాన్ని చాటుకుందా? పేపర్లకీ, టీవీలకీ ఎగబడి ఇంటర్వ్యూలిచ్చిందా? నాలో మహిమలున్నాయి రండి, చేసి చూపిస్తానని' ఎవరికైనా ప్రలోభ పెట్టిందా?

వంచకురాలు, గుండెలు దీసిన బంటు అని బిరుదులిచ్చారు. ఎనిమిదేళ్ల ఈ పిల్ల పద్దెనిమిదేళ్లకు ఎంత పెద్ద క్రిమినల్‌గా మారుతుందో ఊహించమని సవాలు విసిరారు.

ఈ మొత్తం కథలో ఈ చిన్నపిల్ల పాత్రేమిటి? చేసిన తప్పు ఏమిటి?

నేరం చేసిందెవరు? నేరభారాన్ని మోస్తున్నదెవరు? ఆ పిన్నీ బాబాయిల జంటను ఎవరైనా వెదికి పట్టుకున్నారా? వారు కాజేసిన ప్రజాధనం దొరికిందా? అసలైన నేరాలు అవి.

'ఆపరేషన్ అమ్ములు' అని అభం శుభం తెలియని పిల్లను పదేపదే చూపించి ఒక నేరస్థురాలిగా చిత్రీకరించటం భావ్యమేనా?

అసలైన నేరగాళ్లు దొరికినంత దండుకుని ఎక్కడో విశ్లేషంగా ఉన్నారు. ఇదంతా జరిగి రేపు దసరాలకు ఏడాది కావస్తుంది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే.. ఆ బిడ్డను టీవీ ప్రసారం జరిగిన మర్నాడే నా శరణాలయం గుమ్మం వద్ద వదిలి పారిపోయారు ఆ వంచకులు."

సభలో పెద్ద ఎత్తున హాహాకారాలు, అలజడి.

"పోయిన ఏడాది దయనీయమైన స్థితిలో ఎంతో అనారోగ్యంతో నా గుమ్మం దగ్గరపడి ఉంది ఆ బిడ్డ. అలా రావటం ఆ పాప అదృష్టం, నా సుకృతంగా కూడా భావిస్తున్నాను. ఆమె నా దగ్గరకు చేరిన సంగతి నలుగురిలో పడకుండా, మళ్లీ మామూలు మనిషి అయ్యేదాకా జాగ్రత్తగా కాపాడవలసిన నైతిక బాధ్యత నేను వహించాల్సి వచ్చింది.

ఆ మధ్య కొన్ని నెలల క్రితం తిరిగి విషయాన్ని టీవీ ఛానెల్ తిరగదోడింది. 'అమ్మోరు అంతర్థానమై ఆరు నెలలు' అంటూ చూపించిన కథంతా తిరిగి చూపించారు. ప్రజలను దోచుకుని ఆ డబ్బుతో ఎక్కడో 'బాగా సెటిల్ అయి ఉంటుందనీ ముగింపు ఇచ్చారు.

రేపొచ్చే దసరా పండగకి 'అమ్ములు' కథకు తెరపడి సరిగ్గా ఏడాది.

అయితే, నేను చెప్పొచ్చేదేమిటంటే 'అమ్ములు' బాగానే సెటిలయింది. ఆ మాట ఎవరు ఏ ఉద్దేశంతో అన్నా, నేను మాత్రం మనస్ఫూర్తిగా చెబుతున్నాను. అన్నట్టు... ఇక అమ్ములు అంటూ ఎవ్వరూ లేరు. ఈ పాప పేరు అమూల్య. మీ అందరి బిడ్డల్లాంటి తొమ్మిదేళ్ల పిల్ల. ఒక నిర్మలమైన వాతావరణంలో, బాల్యపు అనుభూతుల్నీ, అందరి ప్రేమాదరణలనూ పొందుతూ ఆరోగ్యకరంగా ఎదుగుతోంది మా అమూల్య.

ఆ పాపను దగ్గరకు తీసినందుకు నన్ను ఒక మహోన్నత వ్యక్తిగా చూపించే ప్రయత్నం చెయ్యవద్దని నా హృదయపూర్వక అభ్యర్థన. అమూల్య జీవితాన్ని కొత్తకోణంలో చూపించే ప్రయత్నాలు అంతకంటే వద్దు. ఎటువంటి ఇంటర్వ్యూలు, విశ్లేషణలూ వద్దు. ఇదంతా విన్న తరువాత కూడా మీడియా కానీ, ప్రజలు కానీ ఆ పాపను నేరస్థురాలిగా, వంచకిగా చిత్రించవద్దనీ, ఒక పసిమనసును గాయపరచవద్దనీ, అమాయకపు బాల్యాన్ని కళంకితం చేయవద్దనీ మరీమరీ విన్నవించుకుంటున్నాను. ఏ రకమైన పబ్లిసిటీ అయినా అటువంటి పిల్లలకు హాని మాత్రమే చేస్తుందని మీరు గ్రహించాలి. తల్లీదండ్రీ లేక బురదలో ఇరుక్కుని బయటికొచ్చింది.

ఇక చాలు. అమూల్యను అలా వదిలేసి, తన పాటికి తనను బ్రతకనివ్వండి. ప్లీజ్ లెట్ హర్ బి"

సులోచనా టీచర్ ప్రసంగం ముగించి కూచున్న చాలాసేపటి వరకూ ఎవరూ చప్పట్లు కూడా కొట్టలేనంత మౌనంగా ఉండిపోయారు.

విద్యాశాఖామాత్యులు ప్రసంగిస్తూ అమూల్య ఉదంతం వెనుక ఇంత బాధాకరమైన గతం ఉండడం విచారకరమన్నారు.

కలెక్టరుగారు మాట్లాడుతూ మీడియా తన బాధ్యతలు, పరిమితులు రెంటినీ జాగ్రత్తగా సమన్వయపరచుకుని, అమాయకులపై అపరాధపు నీలినీడలు పడకుండా చూడాలన్నారు. ఎందరు దోషులు తప్పించుకున్నా పర్వాలేదు. కానీ ఒక నిర్దోషి శిక్షింపబడకూడదన్నది మన న్యాయ వ్యవస్థలోనే ఉన్నదన్నారు. ఏది ఏమైనా 'ఆపరేషన్ అమ్ములు' స్టింగ్ ఆపరేషన్ కారణంగానే అమూల్య అనే చిన్నారి వంచనల సుడిగుండంలో నుంచీ బయటపడి జనజీవనస్రవంతిలో కలిసిపోగల్గింది!

సులోచనా టీచర్ చెప్పినట్లు అమూల్య కథ సుఖాంతమని నేనూ భావిస్తున్నాను.

మరి మీరేమంటారు?

○

